# ఇంగువ

రిక్షా దిగుతూ ఉండగా ఎదురొచ్చాడు రాముడు. కొంచెం ఆందోళనగా "ఎట్లా ఉందిరా నాన్నకు?" అని అడిగాను. వాడు నా చేతిలోని సంచీ అందుకుంటూ నాతో పాటే లోపలికి నడుస్తూ "అట్లాగే ఉంది. ఏమీ మార్పు లేదు" అన్నాడు.

"అట్లాగే అంటే? అసలు డాక్టరు ఏమంటాడు?"

"ఏమంటాడు? మహా అయితే వారం రోజులన్నాడు. ఆ మాట చెప్పి కూడా నాలుగు రోజులయింది. అయిన వాళ్లందరికీ కబురు పెట్టమన్నాడు. ఈ లోపల వొచ్చే తెలివీ, పొయ్యే తెలివీ కాస్సేపు కళ్లు తెరచి చూసి ఏదో అంటాడు. అదేమిటో వినిపించి చావదు. అదేమిటో మనం అర్థం చేసుకునే లోపల మళ్లీ మగతలోకి వెళ్ళిపోతాడు".

"కానివ్వు... కానివ్వు... మన చేతుల్లో ఏముంది గనుక?" అంటూ ముందు గదిలోకి వెళ్లాను.

రాముడి భార్య చెంబుతో నీళ్లు తెచ్చిపెట్టి "కాళ్లు కడుక్కోండి" అన్నది.

నేనులేచి సంచిలో నుంచి టవలు తీసుకుని పంచ చివరికి వచ్చి కాళ్లు కడుక్కొని తుడుచుకుని వెళ్లేసరికి చల్లని శుభ్రమైన నీళ్లున్నాయి టీపాయి మీద. గటగట తాగితే ప్రాణం లేచి వచ్చింది.

"ఊఁ! అయితే కథ రోజుల్లోకి వచ్చిందన్న మాట...!" అన్నాను.

"అంతే... అంతే..." అన్నాడు రాముడు దిగులుగా.

"నువ్వు ధైర్యంగా ఉండు. మన చేతుల్లో ఏమున్నది గనక." అన్నాను మళ్ళీ నేను.

ఇంతలో "తాతగారు కళ్ళు తెరిచి చూస్తున్నారు" అంటూ వెళ్లిందొక అమ్మాయి.

రాముడూ, వాడి వెంట నేనూ హడావిడిగా లోపలికి వెళ్లాము.

కుడివైపు గది చిన్నదే. కిటికీ పక్కన నవ్వారు మంచం... మంచంలో రాజశేఖరం. బాగా చిక్కిపోయి ఎముకల గూడులాగ అయిపోయాడు. గడ్డం మాసివుంది. ఇప్పుడు మాత్రం వెల్లకిలా పడుకుని కళ్లు పెద్దవి చేసి పైకి చూస్తున్నాడు.

రాముడు వెళ్లి పక్కనే కూర్చుని "నాన్నా! చూడు ఎవరొచ్చారో..." అన్నాడు పెద్దగా.

రాజశేఖరం ముఖం తిప్పి చూశాడు. కొన్ని క్షణాలు నిశ్చలంగా చూసిన తర్వాత కళ్లలో మెరుపు వచ్చింది. ఏదో అన్నాడు కాని వినిపించ లేదు.

నా కళ్లు చెమర్చాయి. బాగా దగ్గరగా వెళ్లి మీద చెయ్యివేసి నిలబడ్డాను.

రాజశేఖరం చెయ్యి కొంచెం పైకెత్తి "కూర్చో" అని కాబోలు అన్నాడు.

నేను పక్కనే కూర్చున్నాను.

అంతలో అతనికి దగ్గు తెర వచ్చింది. కొద్ది క్షణాలు దగ్గులో ఉక్కిరిబిక్కిరి అయినాడు. తర్వాత తేరుకుని నన్ను దగ్గరగా రమ్మని మళ్ళీ సైగచేశాడు. నేను అతని గుండెల మీదికి వంగి కూర్చున్నాను.

అతి ప్రయత్నం మీద నోరు తెరిచి ఏదో అంటున్నాడు. ధ్వని మాత్రం బయటికి రావడం లేదు. నేను అతని నోటి దగ్గరగా చెవి ఉంచి వినడానికి ప్రయత్నించాను. చివరి కెలాగో ఓపిక తెచ్చుకుని నాకు వినబడేట్టు అన్నాడు.

"ఇంగువ ఏమిటి?"

"అంటే?" అన్నాను నేను.

"అదే... ఇంగువ ఏమిటి?" అన్నాడు మళ్లీ.

ఆ మరుక్షణంలో మగతలోకి జారిపోయాడు. అతని కళ్లు మూతలు పడ్డాయి.

నాకు మతి చెడినంత పని అయింది. లేచి ఇవతలికి వచ్చాను.

ముందు హాల్లో కాస్సేపు కళ్లు మూసుకుని కూర్చున్నాను.

'ఏమిటీ చిత్రం? ఇతనికి అనుమానం ఇంకా తీరనే లేదా? ఇన్నాళ్లు ఇన్నేళ్లు ఈ చిన్న విషయం తెలుసుకోలేకపోయాడా?' అనిపించింది.

ఎప్పటి సంగతి?

దాదాపు పదిహేనేళ్ల క్రిందటి సంగతి.

మే మిద్దరమూ కలిసి చదువుకున్న వాళ్లం. కలిసి తిరిగే వాళ్లం. మమ్మల్ని చూసి అప్పట్లో కొందరు 'రాము - సోము' అనీ, మరి కొందరు 'కరటక దమనకులనీ' అనే వాళ్లు. మా స్నేహం అంత దృఢంగా ఉండేది. ఒకర్ని ఒకరం చూడక ఉండలేకపోయేవాళ్లం. చదువులు పూర్తయిన తర్వాత అతనికి రెవిన్యూ డిపార్టుమెంటులో

ఉద్యోగం వచ్చి ఎటెటో పోయాడు. నేను బడిపంతులుగా స్థిరపడిపోయాను. అన్నీ తెలుస్తూనేవున్నా, ముఖావలోకనాలు మాత్రం సహజంగానే తగ్గిపోయాయి. కలయిక సకృత్తు అయింది.

దాదాపు పదిహేనేళ్ల క్రిందట ఒకసారి మేమిద్దరం వాడి కొడుకు పెళ్లిలోనో, మా అమ్మాయి పెళ్లిలోనో కలుసుకున్నప్పుడు జరిగిందిది. పెళ్లి హడావిడి అయిన మరునాడు బంధు జనం అంతా మూణ్నిద్రలకు తరలిపోగా కాస్త ప్రశాంతత చిక్కగానే ఊరి బయటికి షికారుకు బయల్దేరి చాలా దూరం నడిచిపోయాము. ఎన్నో విషయాలు చర్చకు వచ్చాయి. ఎంతో మాట్లాడుకున్నాము. ఏవేవో గుర్తు చేసుకున్నాము. అతడు ఉన్నట్టుండి "మన జీవితంలో చాలా విషయాలు తెలుసుకోకుండానే వెళ్లిపోతాం...!" అన్నాడు.

"అంటే?" అన్నాను నేను.

"అంటేనా? ఇప్పుడు ఉదాహరణకు నువ్వు రోడ్డు మీద పోతూ ఉంటావు. అవతల దూరంగా వెళ్తున్న ఎవరినో చూడాలనుకుంటావు... కాని ఏ లారీయో, ట్రక్కో అడ్డం వొస్తుంది. అంతే... అవతలి మనిషిని ఎప్పటికీ చూడలేవు. అలాగే ఒకప్పుడు ఏదో అనుమానం వస్తుంది. అది తీరకుండానే ఉండిపోతుంది. ఆ అనుమానం తీర్చుకుందామనే అనుకుంటూ ఉంటాము. కాని వీలుపడదు. ఎప్పటికీ వీలుపడదు. ఏదో చూడాలని అనుకుంటాము, కాని చూడటం ఎప్పటికీ కుదరదు. అలానే కాలం అంతా గడిచి పోతుంది. చివరకు అట్లాగే చచ్చిపోతాము...!"

"ఇదేమి ధోరణి... వెర్రి ధోరణి?" అన్నాను నేను ఆ వాగుడు భరించలేక.

'కాదు కాదు... విను... సీరియస్‌గా ఆలోచించు...' అన్నాడు మళ్ళీ.

"అది మామూలే. ఏ మానవుడికీ అన్నీ తెలియవు..." అన్నాను.

అతడు మళ్లీ "అన్నీ అక్కర్లేదు. కొన్ని చిన్న చిన్న విషయాలే తెలియవు. ఉదాహరణకు నాకు ఇంగువ అంటే ఏమిటో తెలియదు. చిన్నప్పటినుంచీ ప్రశ్న అలాగే ఉండిపోయిందిప్పటి వరకూ... ఎప్పుడూ చూస్తున్నదే కదా! తింటున్నదే కదా! అదేమిటో ఇప్పటికీ తెలియదు నాకు" అన్నాడు.

"అంటే?"

"అంటేనా? అది ఏ పదార్థం? చెట్టు నుంచి వొస్తుందా? ఏదయినా రసాయనిక పదార్థమా? లేక ఒక రకం రాయి వంటిదా? అదీ గాక ఏదన్నా జంతువుకు సంబంధించినదా?"

"నాకు తెలియదు" అన్నాను నేను.

'ఎన్నో సార్లు తెలుసుకోవాలనుకున్నాను. అదేమి చిత్రమో, ఎప్పుడూ వీలుపడలేదు. ఒకసారి ఒక గొప్ప ఫిజిసిస్టు కలిశాడు రైల్లో. చాలా సేపు చాలా విషయాలు మాట్లాడుకున్నాం కూడా. కాని చివరకు ఈ విషయం అడుగుదామనుకుంటూ ఉండగా రైలు ఆగడం, ఆయన హడావిడిగా దిగిపోవడం జరిగాయి. మా అబ్బాయిని ఒకసారి గుర్తొచ్చి అడిగితే వాడు వింతగా చూశాడు తప్ప ఏమీ చెప్పలేదు. మరోసారి ఎవరినో అడిగితే కనుక్కుని చెబుతామన్నారు కాని తర్వాత కనిపించినే నడిగినది ఏమిటో తమకు

గుర్తులేదన్నారు. ఇలా అయింది తప్ప నా అనుమానం తీరనే లేదు".

"తీరుతుందిలే, అదేమీ మహా విషయమా, తీరకపోవడానికి? ఎవరినడిగినా చెబుతారు" అన్నాను నేను. కాని తర్వాత ఆ విషయమే మరిచిపోయాను. వాడూ వేరే ధోరణిలోపడ్డాడు.

అప్పటికి జరిగింది అంతే.

ఇంత కాలం గడిచాక ఇప్పుడు అతడు చావుబ్రతుకుల్లో ఉన్నాడని కబురందుకుని ఆదుర్దాగా బయల్దేరి వస్తే, నా చెవి దగ్గర అతడు మహాశ్రమపడుతూ వేసిన ప్రశ్న "ఇంగువ ఏమిటి?" అని.

నేను లేచి స్నానం చేసి నాలుగు మెతుకుల కతికి మంచం మీద నడుం వాల్చానే కాని మనసు కుదుట పడలేదు.

పక్కన వారూ, వీరూ కూర్చుని మాట్లాడుకుంటున్నారు. కబురందుకుని కొందరు వచ్చినట్టున్నారు.

"ఎవరో ఒకరు ప్రతి నిముషం విడవకుండా దగ్గర కూర్చుంటూ ఉండండి" అంటున్నాడొకాయన.

"ముందుగానే పంచలోకి చేర్చి పక్కగా పడుకోబెడితే మంచిదేమో! అసలే మంచి రోజులు కావు" అన్నారు మరొకరు.

నాకు మనస్సు చివుక్కుమన్నది. రాజశేఖరం కష్టార్జితం ధారపోసి ఎంతో ముచ్చటపడి కట్టుకున్న ఇల్లు... అతణ్ని ఈ సమయంలో బైట పడేస్తారా?

"తొందరపడొద్దు. జాగ్రత్తగా చూస్తూవుంటే లక్షణం తెలుస్తుంది. గురక వంటి దొస్తుంది. చెవులు కింద తమ్మెలు వెనక్కు వంగిపోతాయి. ఒక్కొక్కప్పుడు ఉన్నట్టుండి అదిరిపడటం... వణకడం.... ఉంటాయి. శ్వాసలో మార్పు వస్తుంది. తల ఎగరేయడం వంటి ఏ లక్షణం కనిపించినా వెంటనే పంచలోకి పట్టేయడమే..." అంటున్నారొకరు.

నేనిక కూర్చోలేకపోయాను. లోపలికి వెళ్లి చూస్తే రాజశేఖరానికి అంతకు పది నిముషాలు ముందే తెలివి వచ్చిందనీ, మళ్లీ మరు నిముషంలో మగత కమ్మిందనీ చెప్పింది కోడలు.

నేను ఇవతలికి వచ్చి ఎవరో ఇచ్చిన కాఫీ తాగి ఇంట్లో నుంచి బయటపడ్డాను.

చిన్నప్పుడు మేముండిన పేట... ఆ పరిసరాలు బాగా మారిపోయాయి.

ఇక్కడ ఒక చిన్న సర్కారు బడి ఉండాలి. ఇప్పుడక్కడ ఒక భవనం వెలసింది. పైన ఒక పెద్ద పార్కు ఉండేది.

చిన్న పెద్దా చెట్లతో అక్కడ రకరకాల ఆటలాడుకుంటూ ఉండేవాళ్లం. ఇప్పుడది మునిసిపల్ మార్కెట్ కాంప్లెక్స్ అయింది. ఇక్కడ అప్పుడు అది అత్యంత ఆధునిక భవనం. ఇప్పుడు పాతబడిపోయి కాలం పూసిన మసి పూతలతో శోభావిహీనమై ఉంది. ఏదో చవకబారు హోటలు ఉంది ఇప్పుడందులో. ఊరంతా వెర్రి వాడి ఆలోచనల్లాగ అడ్డదిడ్డంగా పెరిగిపోయింది. రోడ్లన్నీ జనమయం. వచ్చే బళ్లూ, పోయే బళ్లూ...

వాహనాలు... వాటిరొద... అంతా బీభత్సంగా ఉంది. అప్పట్లో కొత్తగా కట్టిన సినిమా హాలు ఇప్పుడు రెండు పెద్ద థియేటర్ల మధ్య ఉద్ధతుల మధ్య పేదలకుండ తరమె అన్నట్లు చిక్కి, ఏదో పాత సినిమా ఆడుతూ, దయనీయంగా ఉంది. ఇక్కడన్నీ చెట్లుండేవి అప్పుడు. ఇప్పుడు ఒక్కటీ లేదు. అప్పటి అణా కాఫీ ఇప్పుడు నాలుగు రూపాయలై పోయింది.

నడుస్తూ ఉండగా నాకు రామేశం గుర్తు వచ్చాడు. కాలేజీ లెక్చరర్.... సీనియర్ బాగా...

వాళ్ల ఇల్లు వెదుక్కుంటూ బయలుదేరాను. పోగా పోగా దొరికింది అది. గేటు తీసుకుని లోపలికి వెళ్లి పంచలో నిలబడి కాలింగ్ బెల్ నొక్కాను. కుక్క ఒకటి భీకరంగా ముందుకు రాబోయింది.

"టైగర్!" అని అరుస్తూ వొచ్చిందొకావిడ. సన్నగా ఎర్రగా ఉంది. ఎవరన్నట్టు చూసింది.

నా గురించి నేను చెప్పుకుని "రామేశం ఉన్నాడా?" అని అడిగాను ఏకవచన ప్రయోగంతో ఆవిడ ఏ మనుకున్నదో ఏమో, "లోపలికి రండి" అన్నది.

"కూర్చోండి. వస్తారిప్పుడే... వచ్చే వేళ అయింది" అన్నది.

సోఫాలో కూర్చున్నాను.

ఆమె లోపలికి వెళ్లి "నాన్నగారి స్నేహితులై ఉంటారు" అంటున్నదెవరితోనో.

ఒక మెరుపు తీగలాంటి పిల్ల టెన్నిస్ రాకెట్‌తో వచ్చి లోపలికి వెళ్లింది. ఆ తర్వాత బరువైన ఎంసెట్ పుస్తకాలతో పద్దెనిమిదిదేళ్ళ కుర్రవాడొకడు లోపలికి వెళ్లాడు. టైగర్ గుమ్మం పక్కనే పడుకుని చూస్తున్నది.

నేను కళ్లు మూసుకున్నాను కాస్సేపు.

ఎదురుగా గోడ గడియారం సంగీతం పాడుతూ ఎనిమిది గంటలు చూపుతున్నది. నేను కళ్లు తెరిచి టీపాయ్ మీద ఉన్న పత్రికలు తిరగేయడం ప్రారంభించాను. రామేశం ఏ సినిమాకయినా వెళ్లాడేమో! ఎప్పటికి వస్తాడో...!

ఆమె ముందు హాల్లోకి వచ్చి "రోజూ ఈ పాటికి వచ్చేవారేనండీ. ఇవాళ ఎందుకాలస్యం అయిందో మరి..." అన్నది.

తర్వాత మంచి నీళ్లు తెప్పించింది. నన్ను గురించి వాకబుచేసి వివరాలు తెలుసుకున్నది.

అప్పుడు రామేశం వచ్చాడు.

నేను నవ్వుతూ లేచి నిలబడ్డాను. అతడు బాగా లావైనాడు. చెవుల దగ్గర చెంపల తెల్లబడ్డాయి. నా వంక పరకాయించి చూసి గుర్తుపట్టి, పెద్దగా నవ్వుతూ చేయి పట్టి లాగి కౌగలించుకున్నాడు.

"ఎన్నేళ్లకు... ఎన్నేళ్లకు కనిపించావు...?" అని ఆశ్చర్యపోయాడు.

"నువ్వు.... ఇవ్వాళ ఎక్కడికీ వెళ్లటానికి వీల్లేదు...!" అంటూ ఆమె వైపు తిరిగి

"శారదా! ఈ పూట మనింట్లోనే ఉంటాడు" అని హడావిడి చేసి, పిల్లలను పిలిచి పరిచయం చేశాడు.

నేను చివరకు "రామేశం! నేను అర్జంటుగా వెళ్లాలి. మరోసారి వస్తాన్లే...!" అన్నాను.

అతడు శాంతించి "అర్జంటా? అయితే సరే... మళ్లీ ఎప్పుడొస్తావు?" అని అడిగాడు.

"వస్తానొస్తాను" అన్నాను నేను.

ఆ తర్వాత "ఒక్కసారి... ఇలారా... ఒక్క క్షణం నీతో మాట్లాడాలి" అన్నాను.

"ఏమిటేమిటి?" అంటూ అతడు దగ్గరగా వచ్చాడు.

ఆమె ఏమనుకున్నదో ఏమో లోపలికి వెళ్లి పోయింది.

"రామేశం! నాకు అర్జంటుగా ఒక సమాచారం కావాలి".

"ఏమిటిది?" అన్నాడతను ఆశ్చర్యంగా.

"ఏమిటంటే... ఏమిటంటే... ఇంగువ ఉంది చూడు... మామూలుగా వంటల్లో వాడుకునే ఇంగువ... అది ఏమిటి? అదేమైనా రసాయనిక పదార్థమా? లేక రాయి వంటిదా? ఉప్పులాగా దొరికేదా? లేక మరోటా? ఆ వివరం చెప్పు...!"

అతడు నివ్వెరపోయాడు. ఆ తర్వాత అదోక రకంగా చూస్తూ... "అదా నీకు కావలసిన అర్జంటు సమాచారం?" అన్నాడు.

ఆ తర్వాత నవ్వుతూ తీరిగ్గా కూర్చోబెట్టి, తనూ కూర్చుని రెండు నిముషాల పాటు వివరం అంతా చెప్పాడు.

ఆ తర్వాత ఏదో అనుమానం వచ్చినవాడిలా చూస్తూ "ఈ చిన్న విషయం కోసం ఎందుకంత తాపత్రయపడుతున్నావు?" అని అడిగాడు.

"ఏమీ లేదులే... నేను వెళ్లొస్తాను..." అంటూ లేచాను హడావిడిగా.

అతడు "ఊళ్లో ఉంటే రేపు తప్పక రావాలి సుమా!" అన్నాడు వెనక నుంచి.

నేను పరుగులాంటి నడకతో రోడ్డు మీదికి వచ్చి కనపడిన రిక్షా ఎక్కి, పదిహేను నిముషాల్లో రాజశేఖరం ఇంటికి చేరుకున్నాను.

రిక్షా వాడికి డబ్బులిచ్చి లోపలికి నడుస్తూ ముందుకు చూశాను. పంచలో ఒకవైపున శవం... తల కింద దీపం... సన్నగా ఆడవాళ్ల ఏడుపులు... పక్కన అయిదారుగురు ఏదో మాట్లాడుకుంటూ...

రాముడు నా దగ్గరగా వచ్చి "ఇందాకే మీరటు వెళ్లారా? ఆ తర్వాత కొద్ది నిమిషాలకు కళ్లు తెరిచాడు. ఎవరినో వెతుకుతున్నట్లు చుట్టూ చూశాడు... రెండుసార్లు తల ఎగరేశాడు... అంతే... అంతా అయిపోయింది..." అంటున్నాడు.

నాకు కాళ్లు వణికాయి. పంచలో చివరగా కూలబడ్డాను.

(ఆంధ్రప్రభ వారపత్రిక - **23 జూన్ 1977**)